సాక్షి గుంటూరు

సోమవారం । 27 । నవంబర్ । 2023



కోలాహలంగా హంసలదీవి తీరం

కోడూరు: హంసలదీవి సాగరతీరం కళకళలాడింది. కార్తిక మాసంతో పాటు ఆదివారం సెలవు కావడంతో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



జ్వాలాతోరణం

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ గుడిలో కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి జ్వాలాతోర ణం నిర్వహించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి, సుస్మిత దంపతులు పాల్గొన్నారు.

చేనేత సూరీడు ప్రగడకోటయ్య



తెనాలి: స్వర్గీయ ప్రగడ కోటయ్య చేనేత రంగ సూరీడని జీసీ సంక్షేమ సంఘం నేతలు కొనియడారు. కోటయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం జగ్గడిగుంటపాలెంలోని ఆయన కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

న్యూస్‌రీల్

రాజ్యాంగం గొప్పది

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: ఇప్పుడు బలహీన వర్గాలకు రాజ్యాధికారం సిద్ధిస్తుందంటే అది బీఆర్ అంబేద్కర్ మహాశయుడు లిఖించిన రాజ్యాంగ గొప్పదనమేనని ఉమ్మడి గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చెప్పారు. ఆదివారం రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని జెడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన హెనీ క్రిస్టినా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అంబేద్కర్ అందరికీ సమాన హక్కులు కల్పించారని కొనియాడారు. తాను ఈ రోజు జెడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రజల ముందు నిలబడి ఉన్నానంటే అది రాజ్యాంగ గొప్పదనమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, పొన్నూరు జెడ్పీటీసీ రమేష్, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడదాం

జాయింట్ కలెక్టర్ రాజకుమారి



గుంటూరు వెస్ట్: రాజ్యాంగం కల్పించిన హక్కులు వినియోగించుకుంటూ విధులు నిర్వర్తించి భారతీయ స్ఫూర్తిని కాపాడదామని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ అందరూ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుంటేనే సుఖమయ జీవనం సిద్ధిస్తుందని చెప్పారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని గొప్పగా రచించారని చెప్పారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఎస్ఈ గుర్రం బ్రహ్మయ్య, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, జిల్లా అధికారులు అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

గిరిప్రదక్షిణకు విస్తృత ఏర్పాట్లు




నరసరావుపేట రూరల్: కోటప్పకొండ గిరిప్రదక్షిణకు వచ్చే భక్తుల కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు తెలిపారు. అరుణాచలం తరహాలోనే కోటప్పకొండ గిరిప్రదక్షిణపై గైడ్ మ్యాప్‌తో కూడిన సమాచార బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే భక్తులు సేదతీరేందుకు గిరిప్రదక్షిణ దారిలో గ్రానైట్ బెంచీలను సిద్ధం చేశామన్నారు. దీంతోపాటు గిరి బాలవిహార్‌లో కొత్తగా వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. గిరిప్రదక్షిణ వెంట నైట్ క్యాంపింగ్ సదుపాయాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇందుకోసం భద్రతను పటిష్టం చేసేందుకు వాచ్‌మెన్‌ను నియమించినట్లు తెలిపారు. గిరిబాల విహార్, గిరిప్రదక్షిణ దారిలో సుందరీకరణ పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఆవరణలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డేక్ సెంటర్)లో 19 ఏళ్ల లోపు పిల్లలకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డేక్ సెంటర్ మేనేజర్ పావులూరి నాగశిరీష తెలిపారు. నవంబర్ 26నుంచి డిసెంబర్ 2 వరకు పిల్లల్లో పుట్టుకతో వచ్చే సమస్యలు, కంటి సమస్యలు, చెవి, ముక్కు, గొంతు సమస్యలు, మానసిక సమస్యలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు. అంగవైకల్యం ఉన్న చిన్నారులకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని వెల్లడించారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని, వివరాలకు 96423 82249 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని నాగశిరీష కోరారు.





కనులు సంబర'పడవ': తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనులు (అంతర చిత్రం)

ఆనంద వి'హారం' : హంస వాహనంలో దేవేరితో కలిసి కొలువుదీరి కృష్ణానదిలో విహరిస్తున్న అమరేశ్వరస్వామి

హరతాళ ధ్వనులు

కార్తిక దీప కాంతులతో కృష్ణా తీరం వెలుగు పూలు విరబూసింది. ప్రణవ నాదం ప్రతిధ్వనించింది. నారికేళ పంచామృతాభిషేకాలతో శివయ్య పొంగిపోయాడు. లక్ష బిల్వార్చనలతో మురిసిపోయాడు. ఆలయాలు భక్తజనాలతో నిండిపోయాయి. కార్తిక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. భక్తులు ఆదివారం తెల్లవారుజాము నుంచి పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించి నదీమతల్లికి ప్రణమిల్లారు. రాత్రి అమరేశ్వరుని తెప్పోత్సవంతో కృష్ణమ్మ భక్తిపారవశ్యంతో పరవళ్లు తొక్కింది. 'హర'తాళధ్వనులతో మార్మోగింది.

- అమరేశ్వరుని భజించిన భక్తులు
- అంగరంగవైభవంగా తెప్పోత్సవం
- పులకించిన కృష్ణాతీరం

అమరావతి : ప్రథమారామ క్షేత్రం అమరావతి శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి తెప్పోత్సవం ఆదివారం రాత్రి పవిత్ర కృష్ణానదిలో అంగరంగవైభవంగా జరిగింది. కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్సవ మూర్తులను అమరారామ పురవీధులలో అర్చకులు ఊరేగించారు. స్థానిక అమరేశ్వర స్నానఘట్టంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామి ఉత్సవ మూర్తులను ఉంచి కృష్ణ హారతి వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ ఆధ్వర్యంలో పవిత్ర కృష్ణవేణికి పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశ హారతులతో నీరాజనం సమర్పించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ కృష్ణానదీ హారతి విశిష్టతను వివరించారు. అనంతరం రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన హంస జల వాహనంపై స్వామి, దేవేరులను అధిష్ఠింపజేసి కృష్ణానదీ తరంగాలపై తెప్పోత్సవం నిర్వహించారు. నేత్రపర్వంగా సాగిన వేడుకను భక్తులు కనులారా వీక్షించి పరవశించారు. అనంతరం నిర్వహించిన జ్వాలా మాలికా దీపోత్సవం భక్తులను ఆధ్యాత్మికోత్సాహంలో ఓలలాడించింది. చిన్నారుల భరతనాట్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



మది పులకించె'నది' : కృష్ణాహారతికి సతీసమేతంగా వచ్చిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

కోటి కాంతుల ఇంద్ర వైభవం

పున్నమి చంద్రుడితో పోటీ పడిన దుర్గమ్మ కొండ

- కోటి దీపోత్సవాన్ని ప్రారంభించిన మంత్రి కొట్టు సత్యనారాయణ
- ఉత్సాహంగా పాల్గొన్న భక్త కోటి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- భక్తిశ్రద్ధలతో జ్వాలా తోరణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కోటి దీపకాంతులతో దుర్గా మల్లేశ్వర స్వామి కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి దేదీప్యమానంగా వెలిగిపోయింది. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని దుర్గమ్మ కొండపై ఆదివారం కోటి దీపోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారికి పంచ హారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసిన లక్ష ఒత్తుల దీపాన్ని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణం, రావి చెట్టు, ఉపాలయాలు, రాజగోపురం ఎదుట, మహా మండపం, రాజగోపురం, గోశాల, కనకదుర్గనగర్, మల్లేశ్వర స్వామి వారి బాలాలయం, లక్ష్మీ గణపతి ప్రాంగణం, మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ముగ్గులతో అందమైన రంగవల్లులను తీర్చిదిద్ది దీపాలను ఏర్పాటు చేశారు. దీపోత్సవంలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున భక్తులు కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. కార్యక్రమాన్ని ఆలయ ఈఈ కోటేశ్వరరావు, రమాదేవిలు పర్యవేక్షించగా, పాలక మండలి సభ్యులు, ఆలయ ఏఈవోలు ఎన్.రమేష్‌బాబు, చంద్రశేఖర్, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన మురళీగానం

కార్తిక పౌర్ణమి, కోటి దీపోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై గూడూరుకు చెందిన డి.ఫణికుమార్ బృందం ఆలపించిన మురళీగానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఫణికుమార్ వేణుగానం చేయగా, ఆర్.శ్రీనివాసరావు నటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు చిన్నారులు ఆంధ్రనాట్య ప్రదర్శన ఇచ్చారు. సాహితీ రవళి, తిలోత్తమ, యామిని ప్రియ, భవ్యశ్రీ, మోహిత, పవిత్రలతో పాటు పలువురు చిన్నారులు ఆంధ్రనాట్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి..

కోటి దీపోత్సవంలో పాల్గొన్న మంత్రి కొట్టు సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం లక్ష్మీ గణపతి ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన జ్వాలా తోరణాన్ని వెలిగించారు.



విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సాహం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం
- 13 జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు
- మూడు రోజులపాటు పోటీలు

నరసరావుపేట రూరల్: విద్యార్థులను విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో 33వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల ఖోఖో పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆరంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు శారీరకంగా దృఢంగా ఉండాలని చెప్పారు. ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాయని చెప్పారు. ప్రతిభగల క్రీడాకారులను గుర్తించి ప్రత్యేక కోచ్‌లను నియమించడంతోపాటు విదేశాల్లోనూ శిక్షణ ఇప్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆటలను ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు.

ఆకట్టుకున్న మార్చ్‌ఫాస్ట్

ఆంధ్రా ఖోఖో అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాలబాలికల సబ్‌జూనియర్ ఖోఖో పోటీలు మూడురోజుల పాటు జరగనున్నాయి. ఆదివారం జ్యోతిప్రజ్వలన అనంతరం 13 జిల్లాల నుంచి బాలబాలికల జట్లు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. తరువాత జాతీయ జెండాతోపాటు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్, జిల్లా ఖోఖో అసోసియేషన్ జెండాలను అతిథులు ఎగురవేసి గౌరవవందనం స్వీకరించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి క్రీడాజ్యోతిని వెలిగించారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు, జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు పిఎస్ఆర్‌కె ప్రసాదరావు, కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.పార్వతి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నంద్యాల సత్యనారాయణరెడ్డి, కె.నాగిరెడ్డి, పాఠశాల వ్యాయామ అధ్యాపకురాలు ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతితో పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

కోటప్పకొండలో భక్తుల రద్దీ





రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో శ్రీత్రికోటేశ్వరస్వామి

కార్తిక పౌర్ణమికి విస్తృత ఏర్పాట్లు

నరసరావుపేట రూరల్: కార్తిక మాసంతోపాటు ఆదివారం సెలవు రోజు కావడంతో కోటప్పకొండలో భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారుజామున స్వామికి ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో మూలవిరాట్ అభిషేకాలను నిలిపివేశారు. అభిషేక మండపంలో నిర్వహించిన అభిషేకాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం వెనుక ఉన్న రావిచెట్టు, నాగేంద్రుని పుట్ట, మహానందీశ్వరుడి విగ్రహాల వద్ద మహిళలు దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్తిక పౌర్ణమి సోమవారం రావడంతో కోటప్పకొండకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లతోపాటు ప్రసాదాలు సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ లేకుండా తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. నరసరావుపేట, చిలకలూరిపేటల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనుంది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులను బందోబస్తుకు నియమించారు.

గండభేరుండ జ్వాలాదీపోత్సవం

మంగళగిరి: గండాలయ స్వామి కొండపైన గుడి వద్ద ఆదివారం గండభేరుండ జ్వాలా దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం కార్తిక పౌర్ణమి సందర్భంగా సనాతన ధర్మ రక్ష సేన ఆధ్వర్యంలో గండాలయ స్వామి కొండపై కార్తిక దీపాలు వెలిగించడంతోపాటు 400 కేజీల ఇత్తడి పళ్లెంలో 400 కేజీల నెయ్యితో తయారు చేసిన గండభేరుండ జ్వాలా దీపోత్సవం వెలిగించారు. అఖండదీపాలు, కార్తిక దీపాల వెలుగులో గండాలయ స్వామి కొండ దేదీప్యమానంగా శోభిల్లింది. సనాతన ధర్మ రక్ష సేన ప్రతినిధులు మాట్లాడుతూ అరుణాచలం తర్వాత మంగళగిరిలో గండభేరుండ జ్వాలా దీపోత్సవాన్ని ఈ ఏడాది ప్రారంభించినట్టు వివరించారు.



గండభేరుండ జ్వాలా దీపాన్ని వెలిగిస్తున్న భక్తులు

• సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 524.30 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 1,539 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సంక్షేమ గళం



▶ స్థలం ఇచ్చారు



మేం కూలి పనులు చేసుకుని బతుకుతుంటాం. మాకు వచ్చే ఆదాయం కూటికే సరిపోదు. ఇంకా గూడు ఎలా సమకూర్చుకోగలం. జగనన్న మాకు వరమిచ్చారు. గూడు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. జగనన్న కాలనీలో స్థలం కేటాయించారు. పట్టా కూడా ఇచ్చారు. నిర్మాణానికి రుణం కూడా ఇస్తామన్నారు. త్వరలోనే సొంతిల్లు కట్టుకుంటామనే నమ్మకం ఏర్పడింది. జగనన్నకు కృతజ్ఞతలు.

కట్టి సీత దంపతులు, మంగళగిరి

● రైతు భరోసా అండ



నేను పదేళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. నాలుగు ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి రైతు భరోసా అండగా నిలుస్తోంది. ఏటా రూ.13,500 చొప్పున ఖాతాలో జమైంది. పెట్టుబడికి ఇబ్బంది లేకుండా పోయింది. జగనన్నకు కృతజ్ఞతలు

– సిద్దెల రాజకిషోర్ బాబు, కౌలు రైతు, పెనుమర్రు, వేమూరు మండలం, బాపట్ల జిల్లా

■ సొంతిల్లు, పథకాలు ఇవ్వడం భేష్



భర్త శ్రీనివాసరావు, ముగ్గురు చిన్నారులు, అత్తమామతో కలిసి గ్రామంలోని చిన్నపెంకుటింటిలో ఉండేవాళ్లం. ఇల్లు పాతది కావడంతో చిన్న వర్షానికే కారుతుండేది. సెంటు పొలం లేదు. నా భర్త శ్రీనివాసరావు బేల్దారి పనులు చేస్తుంటాడు. మేనరికం వల్ల మా ముగ్గురి సంతానం అంగవైకల్యంతో పుట్టారు. 2019లో జగనన్న ప్రభుత్వం వచ్చాక సెంటున్నర స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇచ్చారు. సొంతిల్లు కట్టుకుని అందులో హాయిగా జీవిస్తున్నాం. వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నాం. పిల్లలు ఇద్దరికి రూ.3 వేల చొప్పున వికలాంగ పింఛన్ వస్తోంది. వలంటీర్ల ద్వారా ప్రతి పథకమూ మాకు సక్రమంగా అందుతోంది. జగనన్నకు కృతజ్ఞతలు.

తన్నీరు రాజ్యలక్ష్మి, పంగులూరు, బాపట్ల జిల్లా

క్లుప్తంగా

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన మహేశ్వరికి సత్కారం



సత్తెనపల్లి: జాతీయ స్థాయి అండర్– 14 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన తిరునవల్లి నాగ సాయి మహేశ్వరిని ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కొత్త రామకృష్ణ మాట్లాడుతూ పట్టణంలోని శివ సాయి ఫుట్‌బాల్ క్లబ్‌లో శిక్షణ తీసుకుంటూ స్థానికంగా, జిల్లా స్థాయిలో ఫుట్‌బాల్ పోటీల్లో అనేక పథకాలు అందుకున్న నాగసాయి మహేశ్వరి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. చిన్న వయసులో సత్తెనపల్లి నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం సామాన్యమైన విషయం కాదని పేర్కొన్నారు. కోచ్ సురేష్ మాట్లాడుతూ సత్తెనపల్లికి ఇది ఒక శుభ పరిణామం అన్నారు. ఆర్థికంగా నాగ సాయి మహేశ్వరి వెనుకబడి ఉన్నప్పటికీ ఆత్మ విశ్వాసంతో ఫుట్‌బాల్ పోటీల్లో రాణిస్తుందన్నారు. ముదినేడి సుబ్బయ్య మాట్లాడుతూ ఫుట్‌బాల్ అంతర్జాతీయంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న క్రీడ అని, ఇప్పుడు ఇప్పుడే మన దేశంలో ఫుట్‌బాల్ కి ప్రాముఖ్యత పెరుగుతుందన్నారు. సత్తెనపల్లి నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నాగసాయి మహేశ్వరికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గంప శ్రీనివాసరావు, మచ్చ తిరుపతిరావు, అంకమ్మరావు, క్రాంతి కిరణ్, నవనీత్, ఆకుతోట వినోద్, దాదావలి, విజయ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలి

బాపట్ల: ప్రతిఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలని అదనపు సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి కోరారు. స్థానిక బాపట్ల బార్ అసోసియేషన్‌లో లాడే ఆదివారం నిర్వహించారు. సభకు బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ అధ్యక్షత వహించారు. సభలో జడ్జి వాణి మాట్లాడుతూ సమాజంలో న్యాయవాద వృత్తి ఎంతో ఉన్నతమైనది చెప్పారు. బాధ్యతలు ఎరిగి వారి విధులు నిర్వహిస్తూ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.రుక్మిణి మాట్లాడుతూ న్యాయవాదులు సమాజంలో బాధ్యతతో మెలిగి కక్షిదారులకు న్యాయ సహాయం అందించాలన్నారు. ఏజీపీ శ్యామలాదేవి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఎ.రవిబాబు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నాడు అండగా నిలిచారు.. నేడు ఆశీర్వదించండి

- ముస్లిం సమాజానికి ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి పిలుపు
- ముస్లింలకు సీఎం జగన్ హయాంలోనే మేలు : మేయర్ కావటి
- మైనారిటీల జీవన ప్రమాణాల మెరుగుకు సీఎం కృషి : ఎమ్మెల్యే మద్దాళి గిరి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, వేదికపై నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళిగిరి, ముస్లిం మతపెద్దలు

లక్ష్మీపురం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం దుష్టశక్తులన్నీ ఏకమై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిని చేసి వేధించిన సమయంలో ముస్లిం సమాజం యావత్తు నాడు జగన్ వెన్నంటి నడిచారని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానా వెనుక ప్రాంగణంలో ఇస్లామిక్ కౌన్సిల్ హాల్, లైబ్రరీ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ముస్లిం మతపెద్దలు, ముస్లిం మైనారిటీలతో సమావేశంను ఆదివారం ఏర్పాటు చేశారు. ముందుగా కౌన్సిల్ హాల్, లైబ్రరీ నిర్మాణ పనులను ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాళిగిరి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలేకాక అగ్రవర్ణాలలోని నిరుపేదల సంక్షేమం, అభ్యున్నతికై సుపరిపాలన అందిస్తున్న జగన్‌కు అండగా ఉన్నారని చెప్పారు. భిన్న కులాలు, మతాలు, విభిన్న జాతుల సమూహమైన భారత దేశాన్ని ఒక్క తాటిపై నడిపిస్తున్న ప్రపంచంలోనే అతి గొప్పదైన మన రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న అమృత ఘడియల్లో ఈ శంకుస్థాపన జరగడం శుభపరిణామం అన్నారు. రాష్ట్రంలో మరెక్కడా లేని రీతిలో ముస్లిం మైనారిటీలకు ప్రత్యేకంగా ఇస్లామిక్ కౌన్సిల్ హాల్, లైబ్రరీతో పాటు వసతి గదులు నిర్మాణానికి గుంటూరు వేదిక కావడం సంతోషదాయకంగా ఉందన్నారు. గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు మేలు చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. రాజకీయ ఆర్థిక సామాజిక రంగాలలో ముస్లిం మైనారిటీల ప్రాతినిధ్యాన్ని గణనీయంగా పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రిని చేసే ప్రక్రియలో ముస్లింలు క్రియాశీలకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ గెలుపు కోసమ యావత్ ముస్లిం సమాజం అల్లాహ్‌ను ప్రార్థిస్తూ దువా చేయాలన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల జీవన ప్రమాణాల మెరుగుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కంకణం కట్టుకున్నట్లు చెప్పారు. వారి జీవితాలు బాగుపడాలన్న తన కలను సీఎం సాకారం చేశారన్నారు. అందుకు తాను ముఖ్యమంత్రికి రుణపడి ఉంటానని తెలిపారు. తన నియోజకవర్గంలో ముస్లింల కోసం ఇస్లామిక్ కౌన్సిల్ హాల్, లైబ్రరీ నిర్మాణం జరగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా తన నాలుగున్నరేళ్ల కాలంలో చేపట్టిన అనేక మంచి కార్యక్రమాల్లో ఇది చాలా ప్రత్యేకమైనదన్నారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ప్రభుత్వ ఖాజీ ఉస్మాన్ సిద్ధిఖీ, పశ్చిమ నియోజక వర్గ ఉలమా కమిటీ అబ్బాస్, బషీర్, మన్సూర్, అబ్దుల్ రెహ్మాన్, ఇర్షాద్, ఇస్టాక్, సల్మాన్, సలాం, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షులు జిలాని, షరీఫ్, కార్పొరేటర్లు రోషన్, మార్కెట్ బాబు, ఉడుముల శ్రీనివాస రెడ్డి, అచ్చాల వెంకటరెడ్డి, షాదీఖానా కమిటీ సభ్యులు ఫరియాజ్, షఫీ, నజీర్, గౌస్, బాబు, జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ వై.షేక్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రజ్యోతి శిబిరానికి అనూహ్య స్పందన



వైద్యశిబిరానికి వచ్చిన వారితో ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



దివ్యాంగునికి సాయం చేస్తున్న మురళీకృష్ణ

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- సుద్దపల్లిలో 762మందికి నేత్ర వైద్య పరీక్షలు

చేబ్రోలు: ఆస్తి పాస్తుల కంటే ఆరోగ్యం మిన్న అనే భావన అందరిలో రావాలని, తద్వారా ప్రతి ఒక్కరూ నాణ్యమైన – ఆరోగ్యవంతమైన జీవితాన్ని అనుభవించగలుగుతారని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళి కృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలోని సాయిబాబా కల్యాణ మండపం ఎదురుగా బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నేత్రజ్యోతి ఉచిత వైద్యపరీక్ష శిబిరాన్ని అంబటి మురళీకృష్ణ స్థానిక పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పల్లెలే దేశానికి వెన్నెముకలని, పల్లెలు, గ్రామాల సమగ్రాభివృద్ధికి అనుక్షణం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఆదర్శనీయమైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల నేత్ర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధతో బజరంగ్ నేత్ర జ్యోతి వైద్య శిబిరాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుద్దపల్లి గ్రామంలో ప్రఖ్యాత రంగస్థల సినీ నటుడు 'ఈలపాటి' పద్మశ్రీ కల్యాణం రఘురామయ్య కాంశ్య విగ్రహానికి స్థానిక పెద్దలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యులు762 మందికి ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. వీరిలో కళ్లజోళ్ల ఆవశ్యకత ఉన్నవారికి ఏడు రోజుల్లో గానే నాణ్యమైన వ్యక్తిగత కళ్లజోళ్లను తయారు చేయించి ఇదే గ్రామంలో పంపిణీ చేయనున్నట్లు అంబటి వివరించారు. ఈ శిబిరంలో గుంటూరు ట్రి కాన్ క్లినిక్స్ వారి సహకారంతో 126 మందికి ఫిజియోథెరపీ సేవలు అందజేశారు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలంటూ పాదయాత్ర



యడ్లపాడు: 'మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలంటూ' శ్రీకాకుళం జిల్లా టెక్కలి పట్టణం నుంచి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం రాత్రి పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోకి ప్రవేశించింది. వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యాదవసంఘం అధ్యక్షులు గురునాథ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పాదయాత్ర బృందానికి బోయపాలెంలో గ్రామ సర్పంచి వడ్డేపల్లి నరసింహారావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గురునాథ యాదవ్ మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన టెక్కలి పట్టణం నుంచి ప్రారంభమైన తమ పాదయాత్ర సుమారు వెయ్యి కిలోమీటర్ల మేర కొనసాగుతుందన్నారు. ఏపీలోని కోస్తా, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల మీదుగా డిసెంబర్ ఐదో తేదీన తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రాన్ని చేరుకుంటామని చెప్పారు. గత నాలుగేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి పాదయాత్ర ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పాదయాత్ర బృందంలో కుమారస్వామి, పి.పాపారావు, కె.నవీన్, సాయికుమార్, కె.జగదీష్ ఉన్నారు.

బర్రెలక్క కోసం ఇతర పార్టీల అభ్యర్థులు వైదొలగాలి

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

మంగళగిరి: తెలంగాణ రాష్ట్రంలోని కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న శిరీష(బర్రెలక్క) విజయం కోసం ప్రధాన పార్టీల అభ్యర్థులు వైదొలగాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఆదివారం నిర్వహించిన భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొల్లాపూర్‌లో బర్రెలక్కకు మద్దతుగా ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులకు తప్పించి బర్రెలక్క విజయానికి మద్దతు పలకాలన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రజలకు చేసిన హెచ్చరికలను ప్రస్తావించారు. ప్రజాస్వామ్యంలో కుటుంబపాలన, వ్యక్తి పూజలు రాచరికానికి దారి తీస్తాయన్నారు. రాజకీయాలలో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలనే తాను కొల్లాపూర్‌లో బర్రెలక్క విజయానికి ప్రచారం చేయడం జరిగిందన్నారు. కళాశాల కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగం సేవలు మరువలేనివి

ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహరనాథ శర్మ



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హరిహరనాథ శర్మ, డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: కోవిడ్ సమయంలో వైద్యరంగం మానవత్వాన్ని చాటుకుందని ఏపీ జ్యుడిషల్ అకాడమీ డైరెక్టర్ అవధానం హరిహరనాథ శర్మ అన్నారు. ఆదివారం గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సభకు ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి హరిహరనాథ శర్మ మాట్లాడుతూ మానవజాతి ఉన్నంత వరకు వైద్యరంగం చేసిన సేవలను ఎన్నడూ మరువలేమని తెలిపారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి వైద్యులు వైద్యసేవలు అందించారని కొనియాడారు. వైద్య రంగంతో పాటు శానిటేషన్, పోలీసు వ్యవస్థ బాగా పని చేశాయని వెల్లడించారు. గ్రామాల్లో వైద్యులు పని చేయాలని రాజ్యాంగం చెబుతోందన్నారు. రాజ్యాంగ బద్ధమైన చట్టం ఎంతో ఉన్నతమైందని రాజ్యాంగ నీతికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల వల్ల అన్నిరకాల పురోగతి సాధించామని తెలిపారు. రాజ్యాంగంపై గౌరవం, నమ్మకంతో ముందుకు వెళితే విజయం సాధించడం చాలా తేలికైన పని అన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ వివిధ కులాలకు, మతాలకు, జాతులకు వైవిధ్యమైన దేశం మనదన్నారు. ఈ దేశంలో విభిన్న జాతులు కలిసి జీవిస్తున్నాయని, రాజ్యాంగ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య రంగంలో విశేష మార్పులు చోటు చేసుకుంటున్నాయని, మానవాళి మనుగడకే ప్రమాదం వాటిల్లినప్పుడు వ్యాక్సిన్ ద్వారా ప్రజల ప్రాణాలను కాపాడారని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారని, కొత్తగా 17 మెడికల్ కళాశాలలను తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాజ్యాంగ హక్కుపై అందరి చేత హరిహరనాథ్ శర్మ ప్రమాణం చేయించారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్‌కుమార్, నాటో కో–ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్ కుమార్, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ పాటిబండ్ల అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షల మేరకే రాజ్యాంగ నిర్మాణం



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్



బీఆర్ అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ఏఎస్పీలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్
- భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఘననివాళి

పట్నంబజారు: భారతదేశ ప్రజల ఆకాంక్షల మేరకు ఒక అద్భుతమైన రాజ్యాంగాన్ని నిర్మించుకుని ఆమోదించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లాడ్జిసెంటర్‌లోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. డొక్కా మాట్లాడుతూ ప్రపంచంలోనే మేటి రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 150 కోట్ల ప్రజల జీవితాలకు మార్గం చూపించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకుసాగుతున్నారు. విద్యావ్యవస్థ, పేదలకు ఇళ్ల స్థలాలు, అన్ని వర్గాలకు అండగా నిలబడేలా అంబేడ్కర్ భావజాలాన్ని ముందుకు తీసుకుని వెళ్తున్నారన్నారు. ప్రపంచంలో ఎంతో గొప్ప రాజ్యాంగం మనదేనని తెలిపారు. తాడికొండ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ నేతలు దాసరి జాన్‌బాబు, మాదా రాధాకృష్ణ మూర్తి, పిల్లి మేరి, గనిక ఝాన్సీ, నారదాసు వీరమణీంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.

లాడ్జిసెంటర్‌లో...

భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు లాడ్జిసెంటర్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అత్యంత గొప్ప రాజ్యాంగాన్ని నిర్మించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కీర్తించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, గనిక ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం..

నగరంపాలెం: భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ ఆమోదించగా దేశ ప్రజల అందరికీ సమాన హక్కులు దక్కాయని జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ (పరిపాలన) అన్నారు. గుంటూరు రేంజ్ ఐజీ, జిల్లా ఇన్‌చార్జి జి.పాలరాజు ఆదేశాల మేరకు ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డీపీఓలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్పీ సుప్రజ మాట్లాడుతూ రాజ్యాంగం హక్కులను అనుభవిస్తున్నామని, బాధ్యతలను కూడా నెరవేర్చాల్సిన అవసరం ప్రతీ పౌరునిపై ఉందన్నారు. అందరూ రాజ్యాంగ విలువలను ఆచరించాలని అన్నారు. జిల్లా ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం) మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణలో పోలీస్ శాఖ పాత్ర ముఖ్యమైనదని అన్నారు. అనంతరం భారత రాజ్యాంగంపై ప్రతిజ్ఞ చేశారు. ఎస్బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రమణ్యం, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, రమేష్‌కృష్ణన్, రాఘవయ్య, బ్రహ్మానందం, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తికం.. నమోహం

- కార్తిక పౌర్ణమి సందర్భంగా కాకాని శివాలయంలో భక్తుల సందడి
- దేవాలయం ప్రాంగణంలో శివలింగాకార కోటి దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు


పెదకాకాని: పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం అత్యంత పుణ్యపర్వదినమైన కార్తికపార్ణమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే భక్తులు యజ్ఞాల బావి వద్ద కార్తికమాస స్నానాలు ఆచరించి భక్తి ప్రపత్తులతో దేవాలయంలో ప్రదక్షిణలు చేసి స్వామి వారిని దర్శించుకొని విశేష పూజ అభిషేకాలు చేశారు.

భక్తులు స్వామి వారికి ప్రభలతో వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తికమాస దీపారాధనలు చేసుకున్నారు. భక్తులకు ఏ అసౌకర్యం కలుగకుండా దేవాలయ అధికారులు, పాలకమండలి చైర్మన్, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పెదకాకాని స్టేషన్ హౌస్ ఆఫీసరు బండారు సురేష్‌బాబు భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. దేవాలయ ప్రాంగణంలో పోలీస్ సిబ్బంది సేవలను వినియోగించారు. ఆరోగ్యశాఖ దేవాలయ ప్రాంగణములో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

కోటి శివలింగాకార దీపోత్సవం..

దేవస్థాన ప్రాంగణంలో కోటి శివలింగాకార దీపోత్సవంలో స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య దంపతులు పాల్గొని, దీపాలు వెలిగించి ప్రారంభించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి యు.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకమండలి సభ్యులు భక్తులు పాల్గొన్నారు. దేవాలయ ధ్వజస్తంభం వద్ద జ్వాలా తోరణంను వెలిగించి స్వామి వారిని దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు గావించారు..

డాక్టర్ రామకృష్ణకు క్రీడల్లో ఐదు బంగారు పతకాలు



పతకాలతో డాక్టర్ గాజుల రామకృష్ణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గాజుల రామకృష్ణ జాతీయ క్రీడల్లో తన సత్తా చాటారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జాతీయ క్రీడా పోటీలు జరిగాయి. క్రీడల్లో 19 రాష్ట్రాలకు చెందిన 1100 మందికి పైగా వైద్యులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో డాక్టర్ గాజుల రామకృష్ణ డిస్కత్రో, లాంగ్‌జంప్, షాట్‌పుట్, 100 మీటర్ల స్ప్రింట్ పోటీల్లో ఐదు బంగారు పతకాలు సాధించారు. జావెలిన్ త్రోలో సిల్వర్ మెడల్, ఐదు కిలోమీటర్ల మారథాన్, ఐదు కిలోమీటర్ల వాకథాన్, హైజంప్, ట్రిపుల్ జంప్, 400 మీటర్ల రన్నింగ్‌లో బ్రౌంజ్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయిలో గుంటూరు వైద్యులు, జీజీహెచ్ వైద్యుల సత్తా చాటారు. సుమారు 100 వరకు పలు కీడ్రల్లో మెడల్స్ సాధించి రికార్డును సొంతం చేసుకున్నారు. క్రీడల్లోనే కాకుండా వైద్యవిద్యలో కూడా అరుదైన రికార్డు ఈయన పేరు మీద ఉంది. డాక్టర్ రామకృష్ణ గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ అనంతరం ప్రభుత్వ వైద్యుడిగా పేదలకు సేవలందిస్తూనే జనరల్ మెడిసిన్, న్యూరాలజీ పీజీ వైద్య విద్యను అభ్యసించారు. సుమారు 55 ఏళ్ల వయస్సులోనూ నేడు కార్డియాలజీ పీజీ విద్య అభ్యసిస్తున్నారు. ఒక పీజీ, రెండు సూపర్ స్పెషాలిటీ పీజీలు అభ్యసిస్తున్న ఏకైక వైద్యుడిగా డాక్టర్ గాజుల రామకృష్ణ అరుదైన రికార్డు సృష్టించారు. క్రీడల్లో ఎక్కువ పతకాలు సాధించి గుంటూరు ఖ్యాతిని దేశవ్యాప్తంగా మారుమోగేలా చేసిన డాక్టర్ గాజుల రామకృష్ణను ఆదివారం పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందించారు.

జిల్లా టెన్నికాయిట్ అసోషియేషన్ నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

మంగళగిరి: గుంటూరు జిల్లా టెన్నికాయిట్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నగర పరిధిలోని కుంచనపల్లి అరవింద స్కూలులో టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యవర్గం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర టెన్నికాయిట్ సంయుక్త కార్యదర్శి కాట్రగడ్డ అరవిందకుమార్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించగా, ఎన్నికల అధికారిగా పి.విక్రమ్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా బి.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వై.బాలకృష్ణప్రసాద్, ఎస్.రజనీకాంత్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా బి.రమేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.సూర్యప్రకాశరావు, ట్రెజరర్‌గా బి.రామకోటేశ్వరరావు,జాయింట్ సెక్రటరీలుగా ఎం.రవి, ఎన్.హరికృష్ణ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎం.బాలత్రిపుర సుందరి, ఎం.రమాదేవి, డి.సుజాత, ఎ.రాధిక, ఎస్.సాంబశివరావు, బి.విజయ్ కృష్ణ పాల్గొన్నారు.

వెనుకబడినవర్గాల అభివృద్ధికి 'విశ్వకర్మ' దోహదం



శిక్షణకు హాజరైనవారితో బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: వెనకబడినవర్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర అన్నారు. ఈ పథకంలో 18 చేతివృత్తుల వారు చేరవచ్చని తెలిపారు. జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తుళ్లిమిల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అరండల్‌పేట మూడోలైన్‌లోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వనమా నరేంద్ర మాట్లాడుతూ సమాజంలో వెనుకబడివర్గాల వారికి చేయుత అందించేందుకు, వారి జీవన విధానాన్ని మార్చడం కోసం, వారి ఆర్థిక అసమానతలను తీర్చటం కోసం ఈ పథకం ఏర్పాటు చేశారన్నారు. చేతివృత్తుల వారు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ ఈ పథకానికి సీఎస్‌ఈ సెంటర్స్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకంలో చేరిన చేతివృత్తుల వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యేవారికి రోజుకి రూ.500 ఇస్తారని, శిక్షణ పూర్తిచేసుకున్న వారికి పనిముట్లు కూడా ఇస్తారని వెల్లడించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, విశ్వబ్రాహ్మణ పట్టణ అధ్యక్షుడు హరియాల సుబ్బారావు, పథకం కన్వీనర్ శివరామకృష్ణ ప్రసాద్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోతే శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు కామేపల్లి వెంకటేశ్వర్లు, సురేష్ భాస్కర్, శ్రీనివాసు, వడ్రంగి, కార్పెంటర్లు, బిల్డింగ్ మేస్త్రీలు, ఎలక్ట్రీషియన్స్ పాల్గొన్నారు.